# కులరాజ్యం

"నీకు పెళ్లవలేదా?"

"లేదు."

"ఎంచేత?"

... ...

"సమాధానం చెప్పవేం?"

"చెపుతాను. అర్థమవుతుందా?"

☆ ☆ ☆

కొన్నేళ్ళక్రితం పుట్టాను. పుట్టిన కొన్నాళ్ళకు నాన్న, అమ్మ 'లలిత' అన్న అక్షరాలు బియ్యంలో రాసారు.

'లలిత' లలితంగా ఉండాలిట...

అలాగే ఉన్నాను.

'లలిత' లలితంగా ప్రవర్తించాలట...

అలాగే ప్రవర్తించాను.

'లలిత' లలితంగా మాట్లాడాలిట...

అలాగే మాట్లాడాను.

నాన్న పోలీసు!

అతనికి సంబంధం లేని ఓ యిద్దరు డబ్బున్నాళ్ళు వాళ్ళ డబ్బుపెట్టి, కొన్ని జతల చేతులనీ, కర్రలనీ, బాకులనీ కొనుక్కొని కొట్టుకున్నారుట! ఆ కొట్లాటలో వాళ్ళ పవిత్ర రక్తం తప్ప అలగా రక్తం చాలా ప్రవహించిందట. అలా - ఎవరిదయితేనేం - రక్తం ప్రవహించటం శాంతి భద్రతలకు భంగం అన్న విషయం గుర్తువచ్చి ఆ డబ్బున్నాళ్ళు యిద్దరూ కలిసి ప్రెస్‌లో పశ్చాత్తాపం ప్రకటించారు.

దెబ్బలు తగలని పెద్దలు... వాళ్ళ వాళ్ళ రాజకీయ ప్రయోజనాలలో సర్దుబాటు చేసుకున్నంత చొరవగా దెబ్బలు తిన్న చిన్నవాళ్ళు చేసుకోలేక పోయారు.

వాళ్ళలా దొంగదెబ్బలు తీసుకుంటూండగా.... ఓమారు నాన్న జోరబడ్డాడు. నాన్న తల పగిలింది.

అమ్మ గాజులూ, నా భవిష్యత్తూ పగిలాయి. మామయ్య అవ్యాజానురాగంలో ... అమ్మ ఏడుపులో.... చేతి కందిన సొమ్ము చెదిరిపోయింది.

☆ ☆ ☆

రవి మంచివాడు! రవి నాన్న యింకా మంచివాడు! రవి నాన్న నాన్న యింకా యింకా మంచివాడు.

రవి మంచివాడు!

కనక... నువ్వు లలితంగా ఉన్నావన్నాడు!

మాట్లాడలేదు.

కనక... నువ్వు లలితంగా మాట్లాడతావన్నాడు!

బ్రో ఎత్తలేదు.

కనుక... నువ్వు లలితంగా ప్రవర్తిస్తావన్నాడు.

రవి నాన్న యింకా మంచివాడు!

కనక... లలితంగా ఉండి... మాట్లాడి... ప్రవర్తించి.... మావాడిని సొంతం జేసుకున్న లలితా! నువ్వు మంచిదానివి అన్నాడు. "ఈ పెళ్ళి నాకు యిష్టమే" అన్నాడు. "నా యిష్టం నా చేతిలో లేదు" అన్నాడు. నా యిష్టం మా నాన్న ఆస్తిలో ఉందన్నాడు. మా నాన్న ఆస్తి అతని ఇష్టంలో ఉందన్నాడు.

రవి నాన్న నాన్న యింకా యింకా మంచివాడు.

కనక... నా కొడుక్కీ, మనవడికీ నచ్చిన అందగత్తా! నువ్వూ నాకు నచ్చావు! అన్నాడు.

కనక... నా ఆస్తి మైనస్ నా మనవడిని పెళ్ళాడూ-అన్నాడు.

లేదా... నా ఆస్తి ప్లస్ నన్ను పెళ్ళాడూ... అన్నాడు.

పరవశత్వంతో చెయ్యి చాచాను.

కరుణతో సారీ విదిలించి వదిలిపోయాడు రవి!

☆ ☆ ☆

నేను గుమ్మాలు ఎక్కాను.

గదుల్లోకి ఆహ్వానించారు.

నేను నమస్కారాలు చేసాను.
రెండు చేతులూ చాచమన్నారు.
కన్నీరు పెట్టుకున్నాను.
పన్నీరు చెయ్యమన్నారు.
నాకు పని దొరకలేదు.
వారిచ్చిన పనికి నేను దొరకలేదు.

☆ ☆ ☆

ఉన్నదంతా ఊడిచేసిన మామయ్యను అమ్మ అడిగింది:
"అది ఎన్నాళ్ళిలా పూలు పూయని మొక్కలా... కాయ గాయని చెట్టులా?"
"కొన్నాళ్ళు..."
కొన్నాళ్ళు గడిచాక-
"మరికొన్నాళ్ళు-"
మరికొన్నాళ్ళు గడిచాక -
మామయ్య నోరు విడలేదు.
అత్తయ్య నోరు విప్పింది.

☆ ☆ ☆

"వాడు మూగవాడు. అయినా నా అక్క కొడుకు..."
"అత్తయ్యలాగే బంధుప్రీతి గలవాడు-"
"ఎప్పుడూ అందరినీ కొట్టడు-"
"కొందరిలాగ!"
"అస్తమానూ అందరినీ తిట్టడు-"
"పెళ్ళాంగదా - అసలు తిట్టడు-"
"అయినా వాడు మగాడు-"
"అందగాడు కూడా...."

"అందువల్ల.... వాడి చేత మెళ్ళో తాళి కట్టించుకోండి! గుమ్మాలెక్కి, నమస్కారాలు చేసి, కన్నీళ్ళు పెట్టుకుని నీ కూతురు సంపాదించిన దేమిటి? చెడ్డ పేరు...."

"మామయ్యా - అత్తయ్య మాట-?"
"పెద్దవాళ్ళమాట చద్దన్నం మూట!"

☆ ☆ ☆

వాళ్ళిద్దరి బుర్రకథా ముగిసింది.

అమ్మ మౌనపు రాయికి తగిలి వాళ్ళ ఆసరా పగిలింది.

☆ ☆ ☆

"ఏం చేద్దాం?" అడిగింది అమ్మ...

తల ఎత్తాను.

"ఏదయినా సరే చేద్దాం!"

అమ్మ మొఖంలో దైన్యమూ, ప్రశ్నలూ కదలలేదు.

"అది లలితంగా ఉండదు!"

అమ్మ అనుమానంగా చూసింది.

"అది అభిమానాన్ని అమ్ముకోవటం కాదు!"

అమ్మ తృప్తిగా చూసింది.

"అది నాన్న చేసిన పనే!"

అమ్మ అయోమయంగా చూసింది.

"అయితే మంచి కలలను కత్తిరించటానికి ఆయనకి ఆయుధం యిచ్చారు-"

అమ్మ ఏదో అనబోయింది.

"మంచి కలలను నిజం చేయటానికి నేను -"

"ఆయుధం పుచ్చుకున్నవాళ్ళంతా అర్ధాయుష్కులేనమ్మా!"

"పుచ్చుకోనివాళ్ళంతా పూర్ణాయుష్కులా?"

అమ్మ సమాధానం చెప్పలేక పోయింది.

"ఆయుధాలు లేని... అవసరం లేని... రాజ్యం; పుట్టిన ప్రతి మనిషి పూర్ణాయుష్కునిగా బ్రతకటానికి అవకాశమిచ్చే సమాజం.... మంచి కలలు కావా అమ్మా?"

అమ్మ ఆలోచనలో పడింది.

నేను ఆచరణలో పడ్డాను.

(ప్రజాపక్షం - డిసెంబర్ *1-15, 1992*)